ఉద్యమాలకు రథసారథి పాటే..

- మతం మత్తుకు పాట సరైన వ్యాక్సిన్
- తెలంగాణ గడ్డ.. మతసామరస్య అడ్డా
- సాయుధ రైతాంగ పోరాట చరిత్రను వక్రీకరించే కుట్రను తిప్పికొట్టాలి
- తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్
- నిద్రపుచ్చేది.. నిద్రలేపేది.. మార్గాన్ని చూపేది పాటే : కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి
- తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో లిటరరీ ఫెస్ట్-2022 ప్రారంభం

లిటరరీ ఫెస్ట్-2022లో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆది నుంచి ఉద్యమాలకు, పోరాటాలకు ఊపిరిపోసి నిలబెట్టింది పాటనేనని తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్ అన్నారు. పాటే ఉద్యమాలకు రథసారథి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో 'పాటకు జేజేలు' థీమ్‌తో లిటరరీ ఫెస్ట్-2022 ప్రారంభమైంది. తెలంగాణ సాహితీ అధ్యక్షులు వల్లభాపురం జనార్ధన జెండాను ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం తెలంగాణ సాహితీ రాష్ట్ర కార్యదర్శి కె.ఆనందాచారి అధ్యక్షతన జరిగిన ఫెస్ట్‌లో మొదట సినీనటుడు కృష్ణకు నివాళి అర్పించారు. సంతాపసూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ప్రారంభ ఉపన్యాసాన్ని జూలూరి గౌరీశంకర్ చేశారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం తెలంగాణ గడ్డ మీద రైతాంగ సాయుధ పోరాటం జరిగిందనీ, లక్షలాది ఎకరాల భూమి పేదలకు పంచిన చరిత్ర ఆ పోరాటానిదని గుర్తు చేశారు. బందగీ, షోయబుల్లాఖాన్‌తోపాటు వేలాది మంది రజాకార్ల మూకల దాడిలో చనిపోయారని తెలిపారు. ఆనాటి పోరాటానికి నాయకత్వం వహించిన వారిలో మగ్దూం మొయినోద్దీన్ లాంటి ముస్లింలు కూడా ఉన్నారని తెలిపారు. మతం పేరుతో తెలంగాణ రైతాంగ పోరాటాన్ని చూడటం చరిత్ర హీనులు చేసే పని అని విమర్శించారు. ప్రజలకు మతం మత్తును ఎక్కించాలని కొందరు చేస్తున్న ప్రయత్నాలను ఇక్కడి ప్రగతిశీల శక్తులు, కవులు, రచయితలు, ప్రజాస్వామిక వాదులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. దానికి పాటే సరైన మార్గమనీ, మతం మత్తును వదిలించే వ్యాక్సిన్ పాటేనని నొక్కి చెప్పారు. మొదటి నుంచీ తెలంగాణ గడ్డ మతసామరస్యానికి అడ్డా అని తెలిపారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో తెలంగాణ పర్యటనకు వచ్చిన సమయంలో ఇక్కడి మత సామరస్యాన్ని గాంధీ పొగిడిన విషయాన్ని గుర్తుచేశారు.

అక్షరం పుట్టక ముందే పాట..
శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత కె.ఐ.వరప్రసాదరెడ్డి

అక్షరం పుట్టక ముందే పాట పురుడు పోసుకున్నదనీ, నిద్రపుచ్చేది, నిద్రలేపేదీ, మార్గాన్ని చూపేదీ పాటేనని శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత కె.ఐ.వరప్రసాదరెడ్డి అన్నారు. అనివార్య కారణాల వల్ల లిటరరీ ఫెస్ట్‌కు ప్రత్యక్షంగా హాజరుకాలేకపోయిన ఆయన వీడియో సందేశాన్ని పంపారు. జనం పాట అంటే జానపదమే అన్నారు. సినిమా సమకాలీక పరిస్థితులకు దర్పణం అన్నారు. ప్రస్తుత సినీ పాటల్లో అర్ధంపర్థం లేని సాహిత్యం వచ్చి చేరుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాసల కోసమే, హీరోలను హైలెట్ చేయడం కోసమే వస్తున్న పాటలను తగ్గించేలా చూడాలన్నారు.

పాట ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి
భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ

పాట ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ నొక్కి చెప్పారు. కవులు, రచయితలు తమ భావాలను వ్యక్తపరచడానికి సోషల్ మీడియా ఒక మంచి వేదికగా ఉపయోగపడుతున్నదన్నారు. ఏ విప్లవానికైనా, పోరాటానికైనా దారిచూపేది, పట్టాభిషేకం చేసేది పాటేనని స్పష్టం చేశారు. సామాన్య ప్రజల్లోకి వేగంగా వెళ్లేది, అంతే స్థాయిలో వారిని చైతన్యపరిచేది పాటేనని నొక్కి చెప్పారు.

సాంస్కృతిక విప్లవంతోనే సమాజ మార్పు
మాదాల రవి, సినీనటులు

పాటకు మించిన శక్తియుతమైన ఆయుధం లేదనీ, ఏ దేశం, ఏ రాష్ట్రంలోనైనా సాంస్కృతిక విప్లవం ద్వారానే సమాజ మార్పు జరుగుతుందని సినీ నటులు మాదాల రవి నొక్కి చెప్పారు. కొందరు చెబుతున్నట్టు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కుల, మతాలకు వ్యతిరేకంగా జరిగింది కాదనీ, లక్షలాది మంది పేదలకు భూమి పంచిపెట్టిన, వెట్టి చాకిరీ విముక్తి కోసం జరిగిన పోరాటం అని స్పష్టం చేశారు. ప్రజల్లో చైతన్యం నింపేందుకు అభ్యుదయ, విప్లవ శక్తులు ఐక్యమై విప్లవ శంఖం పూరించాలని కోరారు.

మతంతో కాదు.. మతతత్వంతోనే పేచీ
తెలకపల్లి రవి, సాహితీ, సినీ విమర్శకులు, సీనియర్ పాత్రికేయులు

మతంతో కాదు, మతతత్వంతోనే తమకు పేచీ అని సినీ, సాహితీ విమర్శకులు, సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అన్నారు. మంచి మనస్సు లేని వారు, మానవత్వం లేని వారు మతం గురించి వల్లించడం విడ్డూరంగా ఉందన్నారు. పాట అనేది ఒక బాట, అదొక విజయ బావుటా, ప్రేరణ అని చెప్పారు. సమాజంలోని నేటి పరిస్థితులను సవరించడానికి, విజయం సాధించడానికి పాట దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. సంగీతం ఒక శక్తి అన్నారు. దాన్ని విప్లవ మార్గానికి ఏవిధంగా ఉపయోగించుకోవాలనే దాన్ని పసిగట్టి ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

కులాన్ని, మతాన్ని మోసుకు తిరగడం అంటే శవాన్ని మోసుకెళ్లడమే... : ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

సమాజంలో కులాన్ని, మతాన్ని మోయడం అంటే శవాన్ని మోసుకు తిరగటమే అని ఎమ్మెల్సీ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గోరటి వెంకన్న విమర్శించారు. దుర్మార్గాలకు పాట ఎప్పుడూ భయపడదనీ, ఎదురించి ముందుకు సాగుతుందని చెప్పారు. పాట సమాజపరమనీ, మనవీయ తత్వాన్ని కలిగి ఉంటుందని అన్నారు. ఆలోచనలు నిరంతరం సంఘర్షించాలనీ, వాటి నుంచి మెరుగైన సమాజం రూపుదిద్దుకుంటుందని అని చెప్పారు. ఎప్పటికైనా కమ్యూనిజమే అజేయం అన్నారు.

పాటల్లో వ్యంగాన్ని జోడించే రచయితలు అవసరం
: పిఎ దేవి, సామాజిక వేత్త

పాటల్లో వ్యంగాన్ని జోడించి పాటలు రాసే రచయితలు నేటి సమాజానికి అవసరమని సామాజికవేత్త, రచయిత్రి పీఏ. దేవి నొక్కి చెప్పారు. మతోన్మాదులు కండ్లెరజేసి చూస్తే భయపడకుండా వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. లిటరరీ ఫెస్టులు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. కవుల్లో ఆసక్తి ఉండాలనీ, శక్తి పెంచుకునేందుకు నిరంతరం సాధన చేయాలని సూచించారు. లేనిపక్షంలో ముందుకెళ్లడం కష్టమని చెప్పారు.

తెలంగాణ సాహితీ అధ్యక్షులు ఆనందాచారి మాట్లాడుతూ..సమూహం ఉద్విగ్నం నుంచి వచ్చిందే పాట అన్నారు. కళలపై నేడు మత, సాంస్కృతిక దాడులు జరుగుతున్న తీరును వివరించారు. మధ్యాహ్నం సెషన్‌లో ప్రముఖ గాయని విమలక్క, పద్మశ్రీ పురస్కార గ్రహీత కిన్నెర మొగిలయ్య, సినీనటుడు ఎల్‌బీ శ్రీరామ్, గాయకులు పల్లె నర్సింహ్మా, బండి సత్తెన్న పాటలు పాడి ఫెస్ట్ ప్రతినిధులను ఉత్సాహపరిచారు. ఎల్‌బీ శ్రీరామ్ మాట్లాడుతూ..కరోనా కాలంలో వృద్ధుల కష్టాలపై యూట్యూబ్‌లో వీడియోలు చేసిపెట్టాననీ, పాటలు పాడానని చెప్పారు. మొగిలయ్య మాట్లాడుతూ.. తెలంగాణ మట్టిలోనే పాటల పరిమిళం ఉందని చెప్పారు. ఈ సభలో నవతెలంగాణ ఎడిటర్ ఆర్.సుధాభాస్కర్, కవి యాకూబ్, గీత రచయిత కె.దేవేంద్ర, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ్మా, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహ్మా, తెలంగాణ సాహితీ ఉపాధ్యక్షులు రాంపల్లి రమేశ్, స్ఫూర్తి, తంగిరాల చక్రవర్తి, సహాయ కార్యదర్శి ఎస్‌కే.సలీమా, కోశాధికారి అనంతోజు మోహన్‌కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కేంద్ర ఫాసిస్ట్ విధానాలను వ్యతిరేకిద్దాం

- ప్రభుత్వ విద్యారంగాన్ని నిలబెట్టుకోవడానికి పోరాడుదాం
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా వైరా పట్టణ కేంద్రంలో కమ్మవారి కల్యాణ మండపం (నాగటి నారాయణ ప్రాంగణం)లో ఆదివారం జరిగిన టిఎస్‌యుటిఎఫ్ జిల్లా మహాసభ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతన విద్యా విధానం 2020 రాజ్యాంగ లక్ష్యాలకు తూట్లు పొడిచే విధంగా ఉందని, విద్యా ప్రయివేటీకరణకు పెద్ద పీట వేస్తుందని, చరిత్రను వక్రీకరించి, రాజ్యాంగాన్ని సమూలంగా మార్చివేసి కొన్ని వర్గాలకు మాత్రమే లబ్ది చేకూర్చే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వ వైఖరితో దేశ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. చదువు కొనే వారికి మాత్రమే చదువు అందుతుందని, కష్టపడి చదివి ఐఐటిలో సీటు సాధించిన పేద, దళిత, బహుజన వర్గాల విద్యార్థులు పెంచుతున్న ఫీజులు కట్టలేక చదువులు మానేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అభివృద్ధి చెందిన దేశాల్లో విద్యా, వైద్యం ప్రభుత్వం చేతిలో ఉంటే, మనదేశంలో కార్పొరేట్ల చేతుల్లోకి పోయిందన్నారు. ప్రశ్నించేతత్వాన్ని పెంపొందించే బాధ్యత ప్రభుత్వ ఉపాధ్యాయులదేనని, ఉపాధ్యాయుల ఐక్యత కోసం టిఎస్ యుటిఎఫ్ ప్రధాన భూమిక పోషిస్తోందన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం చేస్తున్న ఉద్యమాలతో విద్యార్థుల తల్లిదండ్రులనూ చైతన్యం చేయాలని సూచించారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఉపాధ్యాయులు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభ ప్రారంభానికి ముందు ఉపాధ్యాయులు బస్టాండ్ సెంటర్ మీదుగా భారీ ర్యాలీగా సభా ప్రాంగణం వరకు వెళ్లారు. ర్యాలీలో వివిధ రకాల డిమాండ్లతో కూడిన ప్లే కార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. సభలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గాభవాని, రాష్ట్ర కార్యదర్శి బండి నరసింహారావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జివి నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల నుంచి విచ్చేసిన కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతూ ఎమ్మెల్సీ గోరంటి వెంకన్న

ఎస్‌ఎఫ్‌ఐ ఒక జ్ఞానశాల

- కెసిఆర్ చుట్టూ ఆర్టిస్టు మార్క్సిస్టు వాదులే : ఎమ్మెల్సీ గోరంటి వెంకన్న
- ఎస్‌ఎఫ్‌ఐ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఈ సమాజంలో మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, పోరాటయోధులను తయారు చేసేది ఎస్‌ఎఫ్‌ఐ మాత్రమేనని ఎమ్మెల్సీ గోరంటి వెంకన్న తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. దీనికి ఆయన హాజరై మాట్లాడుతూ.. ఏమీ తెలియని బాల్య దశలోని కుల వివక్ష, అంటరానితనం.. పేదరికంపై చైతన్య పూరితంగా తయారుచేసి ప్రశ్నించేతత్వం నాకు ఎస్‌ఎఫ్‌ఐ నేర్పించిందని అన్నారు. ఆనాటి యుటిఎఫ్ ఉపాధ్యాయులు చదువుతోపాటు భౌతికవాద విషయాలు, శాస్త్రీయ విద్యా విధానం గురించి ప్రతిరోజూ బోధించేవారని తెలిపారు. ఎబివిపి వాళ్లతో దెబ్బలు తిన్నా, హాస్టల్లో పురుగుల అన్నంపై పోరాటాలు చేసినా.. అందంతా ఎస్‌ఎఫ్‌ఐ ఇచ్చిన పోరాట స్ఫూర్తి చూపిన మార్గమేనని గుర్తు చేశారు. తాను ఈ రోజు ఈ స్థానంలో ఉండడానికి, ఒక పెద్ద సింగర్‌గా పేరు తేవడానికి ఎస్‌ఎఫ్‌ఐ ఒక బాట వేసిందన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ చుట్టూ ఉన్న రచయితలు, మేధావులు, సాహితీవేత్తలందరూ మార్క్సిస్టు వాదులేనని తెలిపారు. నేటి విద్యార్థులందరూ సమాజ మార్పు కోసం ఇంకా కీలకంగా పని చేయాలని తెలిపారు. అనంతరం వినయకుమార్ మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ జిల్లాలో ఎస్‌ఎఫ్‌ఐ స్థాపించినప్పుడు తాను ఒక కార్యకర్తనేని గుర్తుచేశారు. ఆ రోజుల్లో హాస్టల్లో దొడ్డన్నం, పురుగుల అన్నం తినలేక పోయామన్నారు. ఈ సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ ద్వారా పోరాటాలు నడిపించామని గుర్తుచేశారు. సమస్యల పరిష్కారం చేయడానికి పోరాటాల్లోకి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి సంఘం నాయకులు ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక అంశాలపై దృష్టి పెట్టాలని కోరారు. ప్రభుత్వ హస్టళ్లు, పాఠశాలల్లో సమస్యలపై దృష్టి పెట్టి పనిచేస్తే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

ప్రజలకు సత్వర న్యాయమే మా విధి

- బాధ్యతలు చేపట్టిన తెలంగాణ న్యాయమూర్తుల సంఘం నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొత్తగా ఎన్నికైన తెలంగాణ న్యాయమూర్తుల సంఘం, హౌసింగ్ సొసైటీ నాయకులు నూతనంగా బాధ్యతలను స్వీకరించారు. ఆదివారం తెలంగాణ న్యాయమూర్తుల సంఘం, తెలంగాణ న్యాయమూర్తుల హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో సంయుక్త సమావేశం హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని హోటల్ అబోడ్‌లో న్యాయమూర్తుల సంఘం అధ్యక్షులు న్యాయశాఖ కార్యదర్శి నందికొండ నరసింగరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నూతన కమిటీలు బాధ్యతలు స్వీకరించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ సంఘం న్యాయమూర్తుల సంక్షేమం కోసం పనిచేస్తుందని తెలిపారు. అదేవిధంగా న్యాయమూర్తులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించి ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను పాటిస్తూ ప్రజలకు సత్వర న్యాయం అందించాలని తెలిపారు.

అది డబుల్ ఇంజిన్ కాదు.... ట్రబుల్ ఇంజిన్

- వైద్యంలో బిజెపి పాలిత యుపిది చివరి స్థానం
- ఆ పార్టీతో పేదలకు ఉపయోగం లేదు తెలంగాణ దేశంలో మూడో స్థానం
- రెండో ఎఎన్‌ఎం రాష్ట్ర రెండవ మహాసభలో మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అది డబుల్ ఇంజిన్ సర్కారు కాదనీ, ట్రబుల్ ఇంజిన్ సర్కారంటూ రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి టి హరీశ్‌రావు యుపిలోని బిజెపి పాలనపై విరుచుకుపడ్డారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఆర్‌టిసి కళాభవన్‌లో ఆదివారం రెండవ ఎఎన్‌ఎం అసోసియేషన్ (టిఆర్‌ఎస్‌కెవి అనుబంధ సంఘం) రెండో మహాసభలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యరంగంలో బిజెపి పాలిత రాష్ట్రం యుపి చివరి స్థానంలో ఉంటే తెలంగాణ మూడో స్థానంలో ఉందని గుర్తుచేశారు. బిజెపితో పేదలకు ఉపయోగం లేదని స్పష్టం చేశారు. రెండో ఎఎన్‌ఎంలు ఎంత బాగా పని చేస్తే రాష్ట్రం ఆరోగ్యపరంగా అంత ప్రగతిని సాధిస్తుందన్నారు. ఎఎన్‌ఎం సెంటర్లను పల్లె దవాఖానాలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు తెలిపారు. ఈ నెలలో రాష్ట్రవ్యాప్తంగా మరో రెండు వేల పల్లె దవాఖానాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. హైదరాబాద్‌లో 350 బస్తీ దవాఖానాలు ఫలితాలిచ్చాయనీ, బోధనాస్పత్రుల ఒపి తగ్గిందని చెప్పారు. జిల్లాల్లో మరో 150 బస్తీ దవాఖానాలు రానున్నాయని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలుండగా, వచ్చే ఏడాది మరో తొమ్మిది మెడికల్ కాలేజీలు ప్రారంభమవుతాయని ప్రకటించారు. దాంతో ఉస్మానియా, గాంధీలో లభించే వైద్యం జిల్లా స్థాయిలోనే పొందవచ్చని చెప్పారు. టిఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చే నాటికి ప్రభుత్వాస్పత్రుల్లో డెలివరీల శాతం 30 ఉండగా ప్రస్తుతం 67 శాతం పెరిగిందని తెలిపారు. మూడు రోజుల్లో 58 టిఫా స్కానింగ్ మిషన్లను ప్రారంభించనున్నట్టు ప్రకటించారు. సి సెక్షన్లు తగ్గించేలా ప్రభుత్వం పంపించిన వీడియోలను చూపించి గర్భిణిలకు, వారి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని వారికి సూచించారు. లేదంటే ఇబ్బంది కలిగి మొదటి గంటలో బిడ్డకు పట్టాల్సిన ముర్రుపాలు అందని పరిస్థితి ఏర్పడుతుందన్నారు

పూర్తి వయో పరిమితి మినహాయింపు...

పోస్టుల భర్తీలో రెండో ఎఎన్‌ఎంలకు పూర్తి స్థాయిలో వయో పరిమితి మినహాయింపు ఇచ్చినట్టు మంత్రి హరీశ్‌రావు తెలిపారు. కరోనా తర్వాత వెయిటేజీ ఇస్తున్నామనీ, ఏడాదికి రెండు మార్కుల చొప్పున కలుపుతున్నామన్నారు. మొదటి ఎఎన్‌ఎం ఖాళీలకు రెండు నెలల్లో నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటించారు. జీతాలు పెంచడమే కాకుండా వాటిని సకాలంలో ఇస్తున్నామని గుర్తు చేశారు. అరోగ్య తెలంగాణ నిర్మాణంలో కలిసి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. మహాసభలో రెండో ఎఎన్‌ఎం అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకుంది. ఈ కార్యక్రమానికి టిఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు జి రాంబాబు యాదవ్, రెండో ఎఎన్‌ఎం అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు అనురాధ పాల్గొన్నారు.

ప్లాంటేషన్ పోడు మాదే..

- సాగుకు పేదలయత్నం
- అడ్డుకున్న ఫారెస్టు అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోడుకు ప్రత్యామ్నాయ భూమి చూపుతామన్న ఫారెస్టు అధికారులు.. పేదలు సాగుచేస్తున్న పోడులో ప్లాంటేషన్ వేశారు. పేదలకు ప్రత్మామ్నాయ భూమి ఇవ్వకపోవడంతో ప్లాంటేషన్ వేసిన పోడు తమదేనంటూ పోడు రైతులు సాగుకు ప్రయత్నించారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా కారేపల్లి ఫారెస్టు రేంజ్ తాళ్లగూడెం సెక్షన్, ఊట్కూర్ నార్త్ బీట్ పరిధిలోని ఎర్రబోడు సమీపంలో చోటుచేసుకుంది. ఆదివారం ప్లాంటేషన్ నిర్వాసిత పోడుదారులు 10 మంది తమ పోడు భూమి తమకే కావాలంటూ ప్లాంటేషన్‌లోకి వెళ్లి శుభ్రం చేస్తుండగా ఫారెస్టు అధికారులు వారిని అడ్డుకున్నారు. ప్లాంటేషన్‌లో చెట్లను కూడా నరికారు. దాంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుని ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోడుదారుల నుంచి కొడవళ్లు, గొడ్డళ్లను ఫారెస్టు అధికారులు లాక్కొన్నారు.

మాణిక్యారం, గుడితండా, వడ్డెరగుంపు, ఎర్రబోడు గ్రామాలకు చెందిన గిరిజన, గిరిజనేతర పేదలు ఎప్పటి నుండో ఈ ప్రాంతంలో పోడును సాగు చేస్తున్నారు. పేదలు సాగుచేస్తున్న పోడుకు హక్కు లేదంటూ ఫారెస్టు అధికారులు నిత్యం నిర్బంధాలకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలో మూడేండ్ల కిందట ఫారెస్టు అధికారులు పోడు చుట్టూ కందకాలు, ప్లాంటేషన్‌ను ఏర్పాటు చేస్తుండగా సాగుదారులు అడ్డుకొని అందోళన చేశారు. దాంతో అధికారులు పోడు సాగుకు అడ్డురామని, ప్లాంటేషన్ వేసిన పోడుకు ప్రత్నామ్నాయం చూపుతామంటూ చెప్పి పేదలు సాగు చేస్తున్న పోడులో ప్లాంటేషన్ వేశారు. ఇప్పటికీ ప్రత్యామ్నాయ భూమి చూపలేదు. ఇటీవల ప్రభుత్వం పోడు భూములకు హక్కు కల్పించడానికి దరఖాస్తు స్వీకరించి సర్వే చేస్తుండడంతో తమ పోడును ప్లాంటేషన్ చేశారని దాన్ని కూడా సర్వే చేసి తమకు హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తూ పేదలు జిల్లా కలెక్టర్ విపి.గౌతమ్‌ను కలిసి విన్నవించగా ఎలాంటి స్పందన లభించలేదు. దాంతో పేదలు తాము మోసపోయామంటూ తమ పోడులో సాగు చేసుకోవడానికి ప్రయత్నించారు. దాంతో పోడులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఫారెస్టు అధికారులు ప్లాంటేషన్‌లో మొక్కలను ధ్వంసం చేస్తున్నారంటూ 10 మంది పేదలను కారేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకవచ్చారు.

ప్లాంటేషన్ పోడుకు హక్కు కల్పించాలి
వజ్జా రామారావు, అధ్యక్షులు, ఆదివాసీ గిరిజన సంఘం

పేదలు ఎప్పటి నుంచో సాగు చేస్తున్న పోడులో ప్రత్యామ్నాయ భూమి చూపుతామంటూ ఫారెస్టు ప్లాంటేషన్ వేసింది. ప్లాంటేషన్ పోడుకు ప్రత్యామ్నాయం చూపించాలి. లేదా ప్లాంటేషన్‌కు హక్కు అయినా కల్పించాలి.

దేశంలో భయంకరమైన అసమానతలు

- నోట్ల రద్దుతో బ్లాక్‌మనీ వైట్‌గా మార్చారు
- టివిఎస్ రాష్ట్ర సదస్సులో కె నాగేశ్వర్
- నియంతృత్వం పెరిగితే ఫాసిజమే : ఘంటా చక్రపాణి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిజెపి అధికారంలోకి వచ్చాక దేశంలో భయంకరమైన అసమానతలు పెరిగాయని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె నాగేశ్వర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు కొనుగోలు శక్తి పెరిగితే ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందన్నారు. ఉపాధి అవకాశాలను మెరుగుపరచాల్సిన అవసరముందని చెప్పారు. సంపద కేంద్రీకృతమైతే దేశం ఆర్థిక వృద్ధి సాధించినట్టు కాదని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో తెలంగాణ వికాస్ సమితి నిర్వహించిన 'సామాజిక సదస్సు'కు సిఎం ఒఎస్‌డి దేశపతి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 'సంక్షోభంలో భారత ఆర్థిక వ్యవస్థ కారణాలు-ప్రభావాలు' అనే అంశంపై నాగేశ్వర్ మాట్లాడుతూ దేశంలో 22 శాతం సంపద ఒకరి చేతుల్లో కేంద్రీకృతమైందనీ, 50 శాతం జనాభా చేతుల్లో 13 శాతం సంపద ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక వృద్ధి ఆరు శాతం పెరుగుతున్నప్పటికీ అది అసమానతలు పెంచేదిగా ఉందన్నారు. నోట్లను రద్దు చేయడం ద్వారా దేశంలో నల్లధనం బయటికి వస్తుందని నమ్మబలికారని గుర్తు చేశారు. కానీ ఆచరణలో నోట్ల రద్దు నల్లధనాన్ని వైట్ మనీగా మార్చే సాధనంగా మారిందన్నారు. నోట్ల రద్దు అయి ఆరేండ్లు అయినా కూడా నల్లధనం ప్రభుత్వం వద్ద డిపాజిట్ కాలేదని తెలిపారు. దాచుకునేందుకు వీలుగా రెండువేల నోట్లు చెలామణిలోకి తెచ్చిందని విమర్శించారు. నోట్ల రద్దు తర్వాత దేశంలో బోగస్ నోట్లు 10.7 శాతం పెరిగాయని చెప్పారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం చెబుతున్న విషయాలు విఫలం కావడంతో నగదు రహితమే తమ లక్ష్యంగా చెప్పిందని గుర్తు చేశారు. ప్రపంచ దేశాల్లోనే మన దేశం అధికంగా నగదు ఉపయోగిస్తున్నదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత చర్యలతో దేశ ఆర్థిక వ్యవస్థ ముందుకు పోవడం లేదన్నారు. పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ రాయితీలు ఎక్కువగా ఆశిస్తారనీ, కానీ ఉపాధి కల్పనపై దృష్టి సారించరని చెప్పారు. ఇటీవల ఖరీదైన బంగ్లాకు, విలాసవంతమైన కార్ల కొనుగోలు పెరిగిందనీ, అపార్టుమెంట్లకు, బేసిక్ మోడల్ కార్లకు గిరాకీ లేదన్నారు.

అరాచక పాలనలో తిరుగుబాటుకు స్వేచ్ఛ లేదు
:ఘంటా చక్రపాణి

దేశంలో అరాచక పాలన రాజ్యమేలుతున్నదని ప్రొఫెసర్ గంటా చక్రపాణి ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ విలువలను నాశనం చేస్తున్నారని చెప్పారు. భారత రాజ్యాంగ విలువలు- ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై ఆయన మాట్లాడారు. దేశంలో నియంతృత్వం పెరిగి ఫాసిజం విస్తరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్మాదం ఆవహించి దళితులు,మైనార్టీలపై దాడులు చేస్తున్నారని విమర్శించారు. చివరికి న్యాయ స్థానాలూ న్యాయం చేయలేని పరిస్థితి దాపురించిందన్నారు.

స్వాములు, సంఘపరివార్ శక్తులకు తప్ప మరెవరికీ స్వేచ్ఛ లేదని చెప్పారు. బ్రిటీష్ ప్రభుత్వానికి వీర సావర్కర్ లొంగిపోయారంటూ ఎఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ కాగితం చూపితే, ఆయనపై బాంబులేస్తామంటూ మూకలు హెచ్చరిస్తున్నాయని చెప్పారు. గుండాయిజం రాజ్యమేలుతోందని చెప్పారు. 277 మంది ఎమ్మెల్యేలను రూ 5,500 కోట్లతో కొనుగోలు చేసిందంటూ ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రివాల్ వెల్లడించిన విషయాన్ని ప్రస్తావించారు. గవర్నర్లు అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగబద్ధంగా ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను కూలగొట్టే అధికారమెవరిచ్చారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పలువురు మేధావులు, ప్రజాస్వామిక వాదులు, విద్యార్థి, యువజనులు పాల్గొన్నారు.

స్కీమ్‌ల బలోపేతానికి కేంద్రం నిధులు పెంచాలి

- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్
- సంగారెడ్డిలో ప్రారంభమైన ఐకెపి విఓఎల రాష్ట్ర మూడో మహాసభ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశంలో అంగన్వాడీ, ఆశా వంటి కేంద్ర ప్రభుత్వ స్కీమ్‌లలో పనిచేస్తూ, గ్రామీణ పేదరిక నిర్మూలనలో కీలకంగా పనిచేస్తున్న ఐకెపి విఓఎల పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి సరికాదని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్ అన్నారు. సంగారెడ్డిలో తెలంగాణ ఐకెపి విఓఎ ఉద్యోగుల సంఘం (సిఐటియు) రాష్ట్ర మూడవ మహాసభ ఆదివారం ప్రారంభమయ్యాయి. మొదటగా కామ్రేడ్ మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించి మహాసభ ప్రారంభించారు. ఈ సందర్భంగా హాజరైన వెంకటేష్ మాట్లాడుతూ.. పేదరికాన్ని నిర్మూలిస్తామని చెప్పి ఎన్నికల్లో వాగ్దానాలు చేసిన బిజెపి.. ప్రజలను మోసం చేసిందన్నారు. రెండేళ్లలో ఎన్నికలు ఉన్న నేపథ్యంలో భావోద్వేగాలు రెచ్చగొట్టి మూడోసారి కూడా అధికారంలోకి రావడానికి ఆరాటపడుతోందని విమర్శించారు. ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై పరిష్కారం కోసం ఎలాంటి శ్రద్ధ చూపడం లేదన్నారు. 18 ఏళ్ల నుంచి గ్రామాల్లో మహిళాభ్యున్నతి, మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి వారు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు విఓఎలు అవగాహన కల్పిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అన్ని రకాల సంక్షేమ పథకాల విజయవంతానికి కృషి చేస్తున్నారని తెలిపారు. అయినా వారు సెర్ప్ నుంచి చాలీచాలని వేతనాలు పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రెండు నెలల్లో క్షేత్రస్థాయిలో ఐకెపి ఉద్యోగులను కదిలించి పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. అనంతరం ఐకెపి ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్ రమ, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బీరం మల్లేశం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విఓఎలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, గుర్తింపు కార్డులిచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. జిఒ నెంబర్ 58 సవరించాలని, కనీసం వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. రూ.10 లక్షల సాధారణ, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించడంతోపాటు ప్రసూతి సెలవులివ్వాలని తెలపారు. ఒకే రకమైన యూనిఫారాలివ్వాలని డిమాండ్ చేశారు. ఐకెపి విఓఎల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఒక వినతిపత్రం అందజేస్తామని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో రానున్న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చలో అసెంబ్లీ నిర్వహిస్తామన్నారు.

కార్మిక చట్టాలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

- చేనేత వస్త్రాలపై జిఎస్‌టి రద్దు చేయాలి : జూలకంటి
- తెలంగాణ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రథమ మహాసభ

సభలో మాట్లాడుతున్న జూలకంటి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను విస్మరిస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పద్మానగర్‌లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రథమ మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేనేత వస్త్రాలపై విధించిన జిఎస్‌టిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల పనిగంటలు తగ్గించి పనికితగ్గ వేతనాలు పెంచాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న పవర్‌లూమ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వారందరినీ ఐక్యం చేస్తూ పోరాటాలను నిర్వహించేందుకు 2018లో పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ సిరిసిల్లలో ఆవిర్భవించిందని తెలిపారు. ధనబలం, పెట్టుబడిదారుల అండదండలతో అధికారంలోకొచ్చిన ప్రధాని మోడీ నయా ఉదారవాద విధానాలతో పాటు హిందుత్వ ఎజెండాను మరింత దూకుడుగా అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ల లాభాల కోసం భారత కార్మికవర్గం ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను నాలుగు కోడ్లుగా మార్చారన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎనిమిది గంటల పనిని 12 గంటలకు పెంచడంతో పాటు మూడేండ్లు కార్మిక చట్టాలను సస్పెండ్ చేస్తూ ఆర్డినెన్స్‌ను జారీ చేశారని తెలిపారుభారతదేశంలోనే రాష్ట్రాన్ని వస్త్ర నగరిగా తీర్చిదిద్ది, ఐదు లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పి ఇచ్చిన హామీలు అమలుచేయలేదని విమర్శించారు. రెండు వేల ఎకరాల్లో కాకతీయ మెగాటెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేస్తామని, 2014లో వరంగల్‌లో శంకుస్థాపన చేసి నేటికీ తొమ్మిదేళ్లవుతున్నా పార్కు పూర్తి కాలేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి భద్రత కల్పించాలని, కనీస వేతనాలతో పాటు ఇఎస్‌ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ.. సిరిసిల్లలో అమలు చేసిన వర్కర్స్ టు ఓనర్ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలకు కావాల్సిన వస్త్రాలను తెలంగాణలోని పవర్‌లూమ్ కార్మికులచే ఉత్పత్తి చేయాలన్నారు. పవర్‌లూమ్ కార్మికునికి ప్రభుత్వ గ్యారంటీతో రూ. ఐదు లక్షల పెట్టుబడి సాయం పవర్‌లూమ్ కార్పొరేషన్ ద్వారా అందించాలని కోరారు. ఉత్పత్తయిన వస్త్రాలకు మార్కెట్ వసతి కల్పించి వస్త్ర ఉత్పత్తికి అవసరమైన ముడి సరుకులు పాలిస్టర్, కాటన్, రంగులు, రసాయనాల విక్రయకేంద్రాలను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని కోరారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ముషం రమేశ్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభ ప్రారంభోత్సవంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంజి మురళీధర్, యూనియన్ నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, నాయకులు పాల్గొన్నారు.

కెసిఆర్ పాదాలను మొక్కుతున్న డిహెచ్ (ఫైల్)

ఒక్కసారి కాదు.. వందసార్లు కెసిఆర్ కాళ్లు మొక్కుతా...

- డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డా. శ్రీనివాసరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ఒక్కసారి కాదు..వందసార్లు సిఎం కెసిఆర్ కాళ్లు మొక్కుతా...ఆయన నాకు పితృ సమానులు. బంగారు తెలంగాణ దిశగా సాగుతున్న గొప్పపాలనాదక్షులు కెసిఆర్.." అని రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డా జి శ్రీనివాసరావు అన్నారు. కొత్తగూడెంలో ఆదివారం నిర్వహించిన వన మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిఎం కెసిఆర్‌కు పాదాభివందనం చేయడాన్ని కొందరు కావాలని రాద్ధాంతం చేస్తున్నారని చెప్పారు. కెసిఆర్ పాదాలు తాకడం అదృష్టంగా భావిస్తానని అన్నారు.

ఇటీవల వైద్య కళాశాలల ప్రారంభోత్సవం సందర్భంగా తెలంగాణ హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు.. సిఎం కెసిఆర్ కాళ్లు మొక్కారు. కుర్చీలోంచి సిఎం లేచిన అనంతరం ఒకసారి, వెళ్తుండగా మరోసారి ఆయన కాళ్లపై పడ్డారు. కాళ్లు మొక్కడానికి ముందు సిఎం చేతికి డిహెచ్ ఓ ఉత్తరం లాంటిది ఇచ్చారు. దీనిపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఒక ఉన్నత స్థాయి అధికారి.. సిఎంకు పాదాభివందనం చేయడమేంటని నెటిజన్లు, వివిధ రాజకీయ పక్షాల నేతలు విమర్శించారు. ఈ ఘటనపై శ్రీనివాసరావు తాజాగా వివరణ ఇచ్చారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

- టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నట్టు రాష్ట్ర టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పేర్కొన్నారు. సహకార సంఘాలపై ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంచడంలో, తద్వారా మెరుగైన ప్రపంచాన్ని నిర్మించడంలో ఆ సంఘాల సంకల్పం గొప్పదని చెప్పారు. ఆదివారం బ్రస్సెల్స్, బెల్జియంలో ఇంటర్నేషనల్ కో ఆపరేటివ్ బ్యాంకింగ్ అసోసియేషన్ (ఐసిబిఎ) ఆధ్వర్యంలో 'సహకార బ్యాంకింగ్- పీపుల్ సెంటర్డ్ ఇన్‌స్టిట్యూషన్స్' అనే అంశంపై మూడు రోజులపాటు శతాబ్ది ఉత్సవాలు జరిగాయి. సహకార ఆర్థిక సంస్థల భవిష్యత్తు, అధ్యయనం, శక్తి, సమర్థత కోసం తీసుకోవాల్సిన కీలకమైన చర్యలపై అక్కడ చర్చించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఐసిఎ అధ్యక్షులు ఏరియల్ గ్వార్కో, బి.సుబ్రహ్మణ్యం, ఇతర ప్రముఖులు తమ అనుభవాలు పంచుకున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అయినేని

- టిఎస్ టిసిఇఎ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబ్‌నగర్ - రంగారెడ్డి - హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అయినేని సంతోష్ కుమార్‌ను బరిలో నిలుపనున్నట్టు టిఎస్ టిసిఇఎ తెలిపింది. ఈ మేరకు ఆదివారం ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎ.సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శులు దాసరి శ్రీనివాస్, బి.అనంతరామ్, కార్యదర్శి కె.రాజు ఈ అభ్యర్థిత్వాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "సంతోష్ కుమార్ అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం కొన్నేండ్లుగా పని చేస్తున్నారు.

గత ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్సీలు ఏమి చేస్తున్నారు? ఎక్కడ ఉన్నారో అర్థం కాని పరిస్థితి. కొన్నేండ్లుగా ప్రయివేటు విద్యా సంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికీ ప్రయివేటు ఉన్నత విద్యా సంస్థల్లో అధ్యాపకులు, పాఠశాల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. వివిధ పనులు చేయిస్తూ వారిని శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారని" విమర్శించారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల, జూనియర్ కాలేజీ లెక్చరర్లు, పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్లు, ఆయా యూనివర్సిటీ అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాననీ అభ్యర్థి సంతోష్ కుమార్ హామీ ఇచ్చారు.

అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయాలి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- అంగన్‌వాడీ రాష్ట్ర 4వ మహాసభ సందర్భంగా భారీ ర్యాలీ, బహిరంగ సభ

అంగన్‌వాడీ బహిరంగ సభలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని, ఐసిడిఎస్‌కు కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లాలోని మల్లు స్వరాజ్యం ప్రాంగణంలోని సోమ రాధాకష్ణ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) 4వ రాష్ట్ర మహాసభ జరిగింది. ఈ నేపథ్యంలో రాయగిరిలోని లింగబసవ ఫంక్షన్‌హాల్ నుండి సోమ రాధాకృష్ణ ఫంక్షన్‌హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పద్మ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వరంగ స్కీమ్‌లో పనిచేస్తున్న అంగన్వాడీలను ఐసిడిఎస్ స్కీం వర్కర్స్‌గా చూస్తున్నారని, అలాకాకుండా కేంద్ర ప్రభుత్వంలో ఒక ప్రభుత్వశాఖగా గుర్తించాలని కోరారు.

సుప్రీంకోర్టు, కాగ్ నివేదిక ఐసిడిఎస్‌ను కొనసాగించాలని చెప్పినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం దాన్ని పెడచెవిన పెట్టి ఐసిడిఎస్‌ను ఎత్తివేసే కుట్ర చేస్తుందని విమర్శించారు. 1972 గ్రాట్యూటీ చట్టం అంగన్వాడీలకు వర్తిస్తుందని సుప్రీంకోర్టు చెప్పినా కేంద్ర ప్రభుత్వం మాత్రం అమలు చేయడం లేదన్నారు. అనంతరం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి జయలక్ష్మి మాట్లాడుతూ.. ఐసిడిఎస్‌ను మూసివేయాలన్న కేంద్ర ప్రభుత్వ కుట్రతో నూతన జాతీయ విద్యావిధానాన్ని తీసుకువచ్చి అంగన్వాడీ సెంటర్లను ఇబ్బంది పెట్టే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. పెరుగుతున్న ధరలతో సమానంగా అంగన్వాడీలకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఐసిడిఎస్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, ప్రభుత్వ శాఖగా గుర్తించి ప్రయివేటీకరణను ఆపాలని కోరారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సభలో సిఐటియు జిల్లా అధ్యక్షకార్యదర్శులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, దాసరిపాండు, జిల్లా ఉపాధ్యక్షులు కల్లూరి మల్లేశం, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు బూరుగు స్వప్న, సిలివేరు రమాకుమారి, జిల్లా ఆఫీస్ బేరర్స్ దోనూరి నర్సిరెడ్డి, ఎండి పాషా, మామిడి వెంకట్‌రెడ్డి, జిల్లా నాయకత్వం పోతరాజు జహంగీర్, మంచాల మధు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మల్లారెడ్డిని అడుకుంటున్న కాంగ్రెస్ నేతలు

ఎన్నికల హామీ ఏమైంది..?

- మంత్రిని నిలదీసిన కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాదయాత్ర నిర్వహిస్తున్న కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డికి కాంగ్రెస్ శ్రేణుల నుంచి నిరసన ఎదురైంది. మేడ్చల్ జిల్లా గబ్బిలాలపేట ప్రాంతంలో ఆదివారం పాదయాత్ర నిర్వహిస్తున్న క్రమంలో కాంగ్రెస్ నాయకులు మంత్రి మల్లారెడ్డిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. జవహర్ నగర్ ప్రాంతంలో సమస్యలను పరిష్కరిస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చిన మంత్రి ఇప్పటి వరకూ చేసింది ఏమీ లేదని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జవహర్‌నగర్‌లో 50 పడకల ఆసుపత్రి విషయంలో మంత్రి హామీలకే పరిమితమయ్యారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. దీంతో ఒక్కసారిగా కాంగ్రెస్, టిఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తి ఒకరినొకరు తోసుకున్నారు. జవహర్ నగర్ ప్రాంతంలో నెలకొన్న సమస్యల విషయంలో మంత్రి పరిష్కారం చూపాలని.. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమని హెచ్చరించారు.

అనంతగిరి గుట్టలో బస్సు బోల్తా

- ఒకరు మృతి..
- ఆరుగురికి తీవ్రగాయాలు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎంపి, ఎమ్మెల్యే

ప్రమాదం జరిగిన ఘటనా స్థలం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బ్రేకులు ఫెయిలై ఆర్‌టిసి బస్సు అదుపు తప్పి బోల్తా పడి ఒకరు మృతిచెందారు. ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన వికారాబాద్ జిల్లా అనంతగిరి గుట్ట సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న ఎంపి రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, ప్రయాణికులను పరామర్శించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రులకు తరలించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

ప్రయాణికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ డిపోకు చెందిన బస్సు వికారాబాద్ నుంచి ధరూర్ జాతరకు వెళ్తుంది. జాతరకు స్పెషల్ బస్సు కావడంతో సుమారు 72 మంది ప్రయాణికులు ఎక్కారు. అనంతగిరి ఆలయం దాటి కొద్ది దూరం వెళ్లగానే బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపు తప్పి కేరెల్లి లోయలో బోల్తా పడింది. ఈ ఘటనలో సికింద్రాబాద్ రసూల్‌పూరకు చెందిన స్వరూప (37) బస్సు కింద పడి అక్కడికక్కడే మృతిచెందింది. మరో ఆరుగురికి తీవ్రగాయాలు కావడంతో వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దాంతో పాటు ఎక్కువ మంది ప్రయాణికులు ఉండటంతో స్వల్పగాయాలయ్యాయి.

కండిషన్ లేని బస్సులు రూట్లపై వేసి ప్రయాణికుల ప్రాణాలతో చెలగటం ఆడుతున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వికారాబాద్ డిపోలో ఒకటి, రెండు బస్సులు తప్ప ఎక్కువ బస్సులు కండిషన్‌లో లేవని, వెంటనే అధికారులు స్పందించి బస్సులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రయాణికుల ప్రాణాలతో చెలగటం ఆడొద్దని కోరారు. ఘటనపై పూర్తి విచారణ చేపడుతామని ఎంపి, ఎమ్మెల్యే ప్రయాణికులకు హామీ ఇచ్చారు.

ఆకు అదిలినా.. భయం.. భయం..!

- ఆదిలాబాద్ జిల్లాను వణికిస్తున్న పులులు
- పొలం పనులకు వెళ్లేందుకు జంకుతున్న రైతులు, కూలీలు
- పశ్చిమాన పశువులు.. తూర్పున మనుషులపై దాడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను పెద్ద పులులు వణికిస్తున్నాయి.. జనాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.. పంట చేలకు వెళ్లేందుకు సైతం జంకుతున్నారు. గాలికి ఆకులు అదిలినా.. పొరక కదిలినా.. సమీపంలో ఏదైనా అలికిడి వినిపించినా.. పక్క నుంచి కుక్కలు పరుగులు తీసినా.. భయంతో వణికిపోతున్నారు. వారం రోజులుగా బెబ్బులి గాండ్రిపులతో సరిహద్దు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మహారాష్ట్రలోని తిప్పేశ్వర్, తాడోబా అడవుల నుంచి పెద్ద పులులు జిల్లా సరిహద్దుల్లోకి ప్రవేశిస్తుండటంతో సర్వత్రా భయాందోళన నెలకొంది. జిల్లాలో కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ఏర్పాటు చేసినప్పటికీ.. అందులోకి వెళ్లకుండా పంట పొలాల్లోనే తిరుగుతున్నాయి. రెండ్రోజుల కిందట కాగజ్‌నగర్ పట్టణానికి రావడంతో జనం మరింత ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు పులి తిరిగిన ప్రదేశాలను పరిశీలిస్తూ జనాలను అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేస్తున్నారు. పెద్ద పులులు జిల్లాలోని తూర్పు ప్రాంతంలో మనుషులపై దాడి చేస్తుండగా.. పశ్చిమ జిల్లాలో పశువులను హతమార్చడం భయాందోళన రేకెత్తిస్తోంది.

ఇది వరకు జిల్లాకు ఒకటి, రెండ్రోజులపాటు వచ్చిపోయే పులులు వారం రోజులుగా ఇక్కడే తిష్ట వేస్తుండటం.. అదీ అటవీ ప్రాంతంలో కాకుండా పంట పొలాలు, గ్రామాలకు సమీపంలో సంచారంతో జనం భయంతో వణికిపోతున్నారు. కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం ఉన్నప్పటికీ.. అందులోకి వెళ్లకుండా సరిహద్దు గ్రామాల్లోనే సంచరిస్తున్నాయి. పొరుగు రాష్ట్రం మహారాష్ట్రతో సరిహద్దులు పంచుకుంటున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోకి పదుల సంఖ్యలో పులులు ప్రవేశిస్తున్నాయి. ఆదిలాబాద్ జిల్లాకు సరిహద్దులో ఉన్న తిప్పేశ్వర్ అడవిలో పులుల సంఖ్య పెరగడం.. అక్కడ వాటికి అవసరమైన ఆవాసం లభించకపోవడంతో పెన్‌గంగా నది దాటి జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. మరోపక్క మహారాష్ట్రలోని తాడోబా అడవికి సమీపంలో ఉన్న రాజురా అటవీ డివిజన్ నుంచి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లోకి పులులు సులువుగా ఇక్కడకు వస్తున్నాయి.

వరుస ఘటనలతో బెంబేలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పెద్ద పులుల దాడిలో పలు పశువులతోపాటు మనుషులు కూడా ప్రాణం కోల్పోతుండటం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. కిందటేడాది పెంచికల్‌పేట మండలం కొండపల్లిలో పత్తి ఏరుతున్న మహిళను హతమార్చిన పులి.. అదే ఏడాది దహెగాం మండలం దిగిడలో ఓ బాలుడిని హతమార్చిన ఘటన సంచలనం సృష్టించింది. ఈ రెండు ఘటనలే కాకుండా ఇప్పటి వరకు సుమారు 20వరకు ఆవులు, ఎద్దులు, లేగదూడలను చంపేశాయి. తాజాగా వారం రోజుల కిందట వాంకిడి మండలం ఖానాపూర్‌లో పంట చేనుకు కాపలాగా ఉన్న ఓ వృద్ధుడిని పులి అడవిలోకి లాక్కెళ్లి చంపేసింది.

ఈ వారం రోజుల వ్యవధిలోనే సిర్పూర్ మండలం వేంపల్లి దగ్గర ఎనిమిది పశువులను హతమార్చాయి. మరోపక్క భీంపూర్ మండలం తాంసి(కె), పెన్‌గంగా ప్రాజెక్టు కెనాల్‌లో పులులు సంచరించడం.. రెండ్రోజుల తర్వాత ఇదే మండలంలోని గుంజాల వద్ద ఓ పశువును సగం వరకు తిన్నాయి. దీంతో అటవీశాఖ అధికారులు నిఘా కోసం రెండు బేస్‌క్యాంపులు ఏర్పాటు చేయడంతో 20వరకు సీసీ కెమెరాలు బిగించి స్థానిక ప్రజలను అప్రమత్తం చేశారు.

అనుక్షణం..భయం..భయం..!

ఉమ్మడి జిల్లా సరిహద్దులో ఇన్నాండ్లు కరోనాతో భయపడిన జనాలు ఇప్పుడు పెద్ద పులుల రాకతో హడలిపోతున్నారు. అక్కడి తిప్పేశ్వర్, తాడోబా అడవులకు కంచె సక్రమంగా లేకపోవడం.. ఆదిలాబాద్ జిల్లా అడవులు కూడా వాటికి అనుకొని ఉండటంతో పులులు ఇక్కడకు వస్తున్నాయి. ఆవాసం కోసం ఇక్కడకు వస్తున్నప్పటికీ.. కొన్ని రోజుల పాటు హల్‌చల్ చేసి తిరిగి పొరుగు రాష్ట్రానికి వెళ్లిపోతున్నాయి.

పులి దాడికి మృత్యవాత పడ్డ దూడను పరిశీలిస్తున్న అధికారులు

ఇక్కడకు వస్తున్న పులులను కవ్వాల్ రిజర్వ్ ఫారెస్టులోకి పంపించడంలో అటవీశాఖ అధికారులు విఫలమవుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో ప్రస్తుతం జిల్లా సరిహద్దు ప్రాంతాల ప్రజలు అనుక్షణం భయంభయంతో వణికిపోతున్నారు. పంట చేలకు ఒకరిద్దరు కాకుండా గుంపులుగా వెళ్తున్నారు. పత్తి తీసే సమయంలో ఏదైనా కొంచెం అలికిడి వినిపిస్తే రోడ్డుపైకి పరుగులు తీస్తున్నారు. ఎక్కడి నుంచి పులి వచ్చి దాడి చేస్తుందోనని భయాందోళన చెందుతున్నారు. మరోవైపు ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తున్న అటవీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ భరోసా ఇస్తున్నారు.

నేను ఎప్పుడూ ప్రజల మనిషినే..

- నా గురువు వల్లే ఈ స్థాయికి : డా॥ చుక్కా.రామయ్య
- పాలకులను ప్రశ్నిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థకు జీవం పోసిన వ్యక్తి రామయ్య : జస్టిస్ సుదర్శన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాను ఎప్పుడూ ప్రజా మనిషినేనని, పాఠశాల భోధనే కాకుండా దేశం కోసం ఆలోచించి ఆ దిశగా ప్రయత్నాలు చేయాలని డా॥ చుక్కా రామయ్య టీచర్లకు సూచించారు. ఆయన 98వ జన్మదినాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్యాకేంద్రంలో చుక్కా రామయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ జర్నలిస్టు రామచంద్ర మూర్తి అధ్యక్షతన జరిగిన '80 ఏళ్లకుపైగా ప్రజా ఉద్యమ ప్రస్థానం'పై విద్యా గోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన గురువు నమ్మాళ్ స్వామి వల్లే తాను ఇలా ఉన్నానని, ఇంకా దేశానికి సేవలు అందిస్తానని చెప్పారు. తన కోసం వచ్చిన వారికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి ప్రశ్నే శ్వాస అని, సమాజంలో ఉన్న స్తబ్దత, నిశ్శబ్దమే ప్రజాస్వామ్య పతనానికి దారి తీస్తుందన్నారు. ప్రశ్నించేతత్వం, రాజ్యాంగ సంవిధాన విలువలకు రామయ్య నిలువెత్తు నిదర్శనమని తెలిపారు. పాలకులను ప్రశ్నిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థకు జీవం పోసిన వారి జీవన ప్రయాణం, ప్రజా ఉద్యమాలు, రేపటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని చెప్పారు. కళ్ల ముందు కనిపిస్తున్న అసమానతలు, అనైతిక విధానాలపై మౌనం విడకపోతే దేశంలో ప్రజాస్వామ్య మనుగడ ప్రశ్నార్థకమని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు చైర్మెన్ మల్లెపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ.. కమ్యూనిస్టులు, మావోయిస్టులు, తెలంగాణ ఇలా మూడు ఉద్యమాల్లో పాల్గొన్న గొప్ప వ్యక్తి రామయ్య అని, ఆయన పుట్టినరోజు తెలంగాణ ఉద్యమ జన్మదినమని తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు ఆర్.ఆనంద భాస్కర్, కె శ్రీనివాస్, సిఎం సిపిఆర్ఒ జ్వాల నరసింహారావు, లక్ష్మారెడ్డి, దయాకర్, రవీందర్, సారంగపాణి పాల్గొని ప్రసంగించారు.

రాయల కమలమ్మ ఫంక్షన్ హాల్ ప్రారంభం

- విగ్రహాన్ని ఆవిష్కరించిన ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు పుణ్యవతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వెంకటాపురంలో నూతనంగా నిర్మించిన సిపిఎం సీనియర్ నాయకులు రాయల వెంకటేశ్వర్లు కుమారుడు రాయల నాగేశ్వరరావు మాతృమూర్తి రాయల కమలమ్మ జ్ఞాపకార్థం నిర్మించిన ఫంక్షన్ హాల్ (ఆర్‌కే గార్డెన్స్)ను, సిఎల్‌పి నేత, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క లాంఛనీయంగా ఆదివారం ప్రారంభించారు. ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రాయల కమలమ్మ విగ్రహాన్ని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ ఉపాధ్యక్షులు ఎస్.పుణ్యవతి ఆవిష్కరించారు. విగ్రహానికి ఖమ్మం ఎంపి నామా నాగేశ్వరరావు పూలమాలలేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పుణ్యవతి మాట్లాడుతూ.. కమలమ్మ తన భర్త వెంకటేశ్వర్లు అడుగుజాడల్లో నడిచి, కమ్యూనిస్టు పార్టీకి చేయూతనిస్తూ సేవలందించినట్లు తెలిపారు. మహిళా సంఘం కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనేవారన్నారు. పేదలకు అండగా ఉండే పార్టీ సిపిఎం మాత్రమేనని నమ్మిన కమలమ్మ కడదాకా ప్రజా ఉద్యమాలకు అండగా ఉండి అనేక సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, నాయకులు బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బండి రమేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ఐద్వా జిల్లా అధ్యక్షకార్యదర్శులు బండి పద్మ, మాచర్ల భారతి, సిపిఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా భాస్కర్, రాజమల్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పాలడుగు భాస్కర్, జనగం రాజమల్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హన్మకొండలో జరిగిన ఆ యూనియన్ నాలుగో రాష్ట్ర మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. 88 మందితో రాష్ట్ర కమిటీ ఏర్పడింది. అందులో ఆఫీస్ బేరర్లుగా 31 మంది ఉన్నారు. కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఎర్ర నర్సింహులు, కోశాధికారిగా జక్కల రవికుమార్, మహిళా కన్వీనర్‌గా వి.నాగమణి, కార్యదర్శులుగా పాలడుగు సుధాకర్, తుమ్మ విష్ణువర్ధన్, జన్ను ప్రకాశ్, రాజనర్సు, గోవర్ధన్, వెంకటస్వామి, డి.కిషన్, సిహెచ్.రవి, డి.పాండు, నవనీత, సత్యం, జె.వెంకటేశ్, ఎం.శ్రావణ్‌కుమార్, జి.యాదమ్మ, హంసమ్మ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఈ.అంజయ్య, బుజ్జమ్మ, ఆర్.వాణి, జి.అశోక్, ఉప్పలయ్య, ఎ.వెంకటేశ్, బాలనర్సింహ్మా, జనక శ్రీను, జయరాం, నెమ్మాది వెంకటేశ్వర్లు, జ్యోతి, పెరికె అంజమ్మ ఉండనున్నారు.

పాదయాత్రలో మాట్లాడుతున్న డిజి నరసింహారావు

సింగరేణి గుడిసె వాసులకు ఇళ్ల పట్టాలివ్వాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని సింగరేణి కాలనీలో గుడిసెవాసులు ఉన్నచోటనే పక్కా ఇళు నిర్మించి పట్టాలివ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డిజి నరసింహారావు, హైదరాబాద్ సౌత్ కార్యదర్శి ఎండి అబ్బాస్ డిమాండ్ చేశారు. సిపిఎం హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో సింగరేణి గుడిసె వాసులతో కలిసి కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 25 ఏళ్ల నుంచి కాలనీలోని గుడిసెల్లో నివసిస్తున్నా ఇప్పటివరకు ఏ ప్రభుత్వం నుంచి వారికి లబ్ధి చేకూరలేదన్నారు. పైగా ఆ ప్రాంతంలో ఉన్న సొసైటీ వాళ్లు సుప్రీంకోర్టు తీర్పును ధిక్కరిస్తూ ఆ ప్రాంతంలో అపార్ట్‌మెంట్లు నిర్వహిస్తున్నారని తెలిపారు. గుడిసె వాసులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం హైదరాబాద్ సౌత్ కమిటీ సభ్యులు బాలు నాయక్, విఠల్, కోటయ్య, నాగేశ్వర్, శ్రావణ్ కుమార్, శశికళ, మీసాల లక్ష్మమ్మ, అబ్దుల్ లతీఫ్, సత్తార్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం

- నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సుంకోజు కృష్ణమాచారి, రాళ్లబండి విష్ణుచారి, కోశాధికారిగా తాటికొండ శ్రీరాములు ఎన్నికయ్యారు. నామాలగుండులోని బిఎస్ఆర్ గార్డెన్‌లో ఆదివారం సంఘం ముఖ్య సలహాదారు మయబ్రహ్మ నర్సింహ అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం జరిగింది. గౌరవాధ్యక్షులు ఎర్రవెల్లి బాలాచారి, మాజీ అధ్యక్షులు కుందారం గణేష్‌చారి సమక్షంలో నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. రాష్ట్ర, జిల్లా కమిటీల కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో సమావేశానికి హాజరయ్యారు. కమ్మరి, వడ్రంగుల కర్రకోత మిషన్లకు షరతులు లేకుండా లైసెన్సులు మంజూరు చేయాలనీ, రైతు బంధు తరహాలో ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో వృత్తిదారులకు ఉచితంగా ఎకరం భూమి ఇవ్వాలనీ, దుకాణ సముదాయాలు ఏర్పాటు చేయాలనీ, 50 ఏండ్లు నిండిన వృత్తిదారులకు నెలకు రూ.ఐదు వేలు పెన్షన్ ఇవ్వాలన్నారు. 13 డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అన్ని జిల్లాల్లో ప్రజాప్రతినిధులు, కలెక్టర్లకు అందజేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు పుల్లోజు అశోక్‌చారి, మేడ్చల్, రంగారెడ్డి, యాదాద్రి-భువనగిరి జిల్లాల అధ్యక్షులు టి నర్సింహచారి, శంకరాచారి, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.